క్లుప్తంగా

వివాహ వేడుకకు హాజరైన జడ్జి


వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన డోన్ బార్ కౌన్సిల్ మాజీ కోశాధికారి, సీనియర్ న్యాయవాది పులి దామోదర్ కూతురు పులి దివ్య వివాహానికి సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి తంగమణి హాజరయ్యారు. నూతన వధూవరులు పులి దివ్య, శ్రీకర మణికంఠ కార్తీక్‌కు శుభాకాంక్షలు తెలిపి ఆశ్వీరదించారు. అదేవిధంగా ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, మధుసూదనరెడ్డి, బద్దల వెంకటేష్‌యాదవ్, రవికుమార్ తదితరులు ఈ శుభకార్యానికి హాజరయ్యారు.

వృద్ధులను గౌరవించాలి


వృద్ధులను సన్మానించిన దృశ్యం

బనగానపల్లె రూరల్ : సీనియర్ సిటిజన్స్ (వయోవృద్ధులను) కుటుంబ సభ్యులతో పాటు ప్రతిఒక్కరూ గౌరవించి, ఆదరించాలని టౌన్ సీఎస్ఐ చర్చి రెవరెండ్ ఆల్‌బర్ట్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో సీనియర్ సిటిజన్ సండే పురస్కరించుకొని సంఘంలోని 70 ఏళ్లపై బడిన 12 మంది వయోవృద్ధులను సన్మానించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఆల్‌బర్ట్ మాట్లాడుతూ వయోవృద్ధులు ఎంతో కష్టపడి తమ పిల్లలను పోషించి ఉంటారని, వారికి కుటుంబ సభ్యులు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు కరుణాకర్, మనోహర్, పల్లె ప్రసాద్, భాస్కర్,జాకబ్, భాగ్యరాజ్, నవీన్, క్రిష్టిఆల్‌బర్ట్, మంజులామణి, శాంతమ్మ, స్త్రీల మైత్రి సంఘం పెద్దలు ప్రశాంతి, కళావతి, రేవతి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానవతా స్వచ్ఛంద సంస్థకు రూ. 50 వేలు విరాళం


నగదు అందజేస్తున్న దాతలు

కోవెలకుంట్ల: పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలను మెచ్చి పలువురు దాతలు ఆదివారం విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన మల్లికార్జునరావు, సత్యనరసింహులు, మురళీకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజులు ఒక్కొక్కరు రూ. 10వేల చొప్పున రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు, సెక్రటరీ రామసుబ్బారెడ్డి, కార్యవర్గ సభ్యులు మురళీమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కేశవ్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ ప్రారంభం


టాస్ వేసి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న రాజేష్

డోన్ : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక శేషారెడ్డి ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదివారం ప్రారంభించారు. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీలలో పాల్గొనేందుకు 53 జట్లు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీన మంత్రి బుగ్గన జన్మదినం రోజున విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ, ఆటల పోటీల నిర్వాహకులు కౌన్సిలర్ రైల్వే నాగేంద్ర, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం


రోగులకు మందుల పంపిణీ చేస్తున్న వైద్యులు

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరి రెడ్డి ప్రతి నెలా ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వైద్య శిబిరంలో గుండె జబ్బు, బీపీ, షుగర్, కంటి, ఊపిరితిత్తులు తదితర వ్యాధులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలి రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక ఉపశమనం

- పేదలకు వరంగా మారిన సీఎం రిలీఫ్ ఫండ్
- ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు ఊరట
- ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కిస్తున్న ప్రభుత్వం
- బనగానపల్లె నియోజకవర్గంలో రూ.5కోట్లకు పైగానే పంపిణీ

కొలిమిగుండ్ల: ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యనిస్తుంది. పేదల ఆరోగ్యం కోసం ఎక్కడా వెనుకడుగు వేయకుండా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. అనుకోని రీతిలో జబ్బు చేసినా, ప్రమాదంలో గాయపడినా, ప్రాణాల మీదకు వచ్చినా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంతో ప్రభుత్వమే పూర్తిగా వైద్య ఖర్చులు భరించి క్షేమంగా ఇంటికి చేర్చేలా బాధ్యత తీసుకోవడంతో పేదలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వైద్యం కోసం ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేయడంతో పాటు నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసి రోగులకు మంచి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేలా చేసింది ప్రభుత్వం. ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించని కేసులకు సంబంధించి రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తుంది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం. ఆరోగ్యశ్రీతో ఎందరో పేదలు ఉచిత వైద్య సేవలు పొందుతుంటే, సీఎంఆర్‌ఎఫ్ కింద మరింత మందికి బాసటగా నిలుస్తుంది. ఆరోగ్యశ్రీలో వైద్యం లేని వ్యాధులకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందిన పేద, మధ్య తరగతి వర్గాలకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారు. గతంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీలో చాలా జాప్యం చోటు చేసుకునేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సకాలంలో బాధితులకు సాయం అందేలా చూస్తున్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి(ఫైల్)

నియోజకవర్గంలో రూ.5కోట్లకు పైగానే

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.5.25 కోట్లు సాయం అందించారు. మొత్తం 19 విడతల్లో 883 మంది బాధితులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకున్న రోగులకు ఆసుపత్రిలో వైద్యం అయిన ఖర్చు మేరకు సాయం అందుతుంది. నియోజకవర్గంలో రూ.20 వేలు మొదలు కొని రూ.5లక్షలకు పైగానే సాయం తీసుకున్న బాధితులు ఉన్నారు. ఎమ్మెల్యే కాటసాని సీఎం రిలీఫ్ ఫండ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామాల పర్యటనకు వెళ్లినప్పుడు లేదా నేరుగా తనను కలిసి సమస్య విన్నవించినా అప్పటికప్పుడు సీఎం సహాయ నిధికి దరఖాస్తులను పంపి ఆర్థిక సాయం వచ్చేలా కృషి చేస్తున్నారు.

సాయం చేసి ఆదుకున్నారు..



మోకాలికి ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది. ఆరోగ్యశ్రీ వర్తించక పోవడంతో తప్పని సరి పరిస్థితుల్లో ఇబ్బందులు ఉన్నా సొంతంగా ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నా. ఇతరుల ద్వారా తెలుసుకుని సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.1.20 లక్షలు మంజూరు చేసింది. మాలాంటి వాళ్లకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– దేవి, నాయినపల్లె

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



కాలు సరిగా లేక పోవడంతో అనంతపురంలోని వైఎస్సార్ ఆసుపత్రిలో సొంత ఖర్చులతో ఆపరేషన్ చేయించుకున్నా. గ్రామంలోని నాయకుల సాయంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా రూ.26 వేలు అందించారు. కూలీ పని చేసుకునే వాళ్ల వేలకు వేలు ఖర్చు చేసి వైద్యం చేయించుకోవాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు సీఎం రిలీఫ్ ఫండ్ పేదలను ఆదుకుంటుంది.

– మురళి,గొర్విమానుపల్లె

రూ.5లక్షలు మంజూరైంది



మాఅబ్బాయికి బోన్‌మ్యారో సమస్య ఏర్పడటంతో తమిళనాడులోని వేలూరులో వైద్యం చేయించాం. రూ.13.50 లక్షలు వెచ్చించి అబ్బాయి వైద్యానికి ఖర్చు చేశా. విషయాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఏమాత్రం ఆలోచించకుండా బిల్లులు పరిశీలించి దరఖాస్తు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.5లక్షలు వచ్చేలా చేశారు. ఎమ్మెల్యే కాటసాని సాయం మరువం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– గోపాల్‌రెడ్డి,కొండమీదపల్లె

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు పీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

సంజామల: మండలలోని పీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ఆల్వకొండ, ముక్కమల్ల వసంతాపురం, ఎగ్గోని, కానాల, గిద్దలూరు, లింగందిన్నె, అక్కంపల్లె పీడర్ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు ప్రార్థన సమయం నిర్వాహకులు ప్రతి ఆదివారం చేపట్టే పంపిణీ రొట్టె, గుడ్డు, పప్పు కార్యక్రమం కొనసాగింది. పౌష్టికాహారం పంపిణీకి పట్టణ ప్రముఖులు నాగరాజుగౌడ్, ప్రణయ్‌గౌడ్ ఆర్థిక సాయం చేశారని నిర్వాహకులు జాన్ ప్రభాకర్ తెలిపారు.

విజయ డెయిరీ సబ్సిడీ చెక్కుల పంపిణీ

బనగానపల్లెరూరల్ : బనగానపల్లె విజయ డెయిరీ యూనిట్ పరిధిలోని పాడి రైతులకు సబ్సిడీ చెక్కులను యూనిట్ మేనేజర్ మధుసూదన్‌బాబు ఆదివారం అందజేశారు. మండలంలోని నందివర్గం యేస్తేరమ్మ సెంటర్‌లోని ఇద్దరు మహిళా రైతులు పశువులను కొనుగోలు చేయడంతో సంస్థ 20 శాతం రాయితీకి సంబంధించి రూ.32వేల చెక్కు అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని జుబేదా సెంటర్‌కు సంబంధించి సంస్థ అందజేయు పశుగ్రాసం సబ్సిడీ ఎకరానికి రూ.5వేల చొప్పున ఎనిమిది మంది పాడి రైతులకుగాను మొత్తం రూ.17,500 చెక్కులు అందజేశారు. గుండ్లశింగవరం, అన్నవరం గ్రామాలకు చెందిన ఐదు మంది రైతులు పశువులు కొనుగోలు చేయగా రాయితీ మొత్తం రూ.79,900 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏజెంట్లు కె.లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలరాజు, జూబేదాబి తదితర రైతులు పాల్గొన్నారు.


నందివర్గం యేస్తేరమ్మ సెంటర్‌కు చెక్కులను పంపిణీ చేస్తున్న యూనిట్ మేనేజర్ మధుసూదన్‌బాబు

పుస్తకాల ఆవిష్కరణ

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరులోని పుస్తక నిక్షిప్త కేంద్రానికి కేటాయించిన 2300 పుస్తకాలను ఆదివారం నిర్వహకుడు మద్దిలేటితో కలసి రిటైర్డ్ తెలుగు పండిత్ చెన్నకేశవ శాస్త్రి, సంజామల గ్రంథాలయ అధికారి బాల తిమ్మరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థులు,యువత గ్రంథయాలన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నివాళి

డోన్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు దివంగత ఏసీ పుల్లారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్ర పటానికి రోటరీక్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వద్ద క్లబ్ అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, కార్యదర్శులు ఆర్‌డీ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌కేడీ యూనివర్సిటీ ఈసీ సభ్యులు నాగభూషణంరెడ్డి, క్లబ్ సభ్యులు శంకర్‌గౌడ్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

మల్లన్న సేవలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్ర చీఫ్‌సెక్రటరీ శాంతి కుమారి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివార్లకు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.


తెలంగాణ చీఫ్‌సెక్రటరీ శాంతికుమారి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని కోవెలకుంట్ల– ఆళ్లగడ్డ రహదారిలో నడిచే ఆర్టీసీ బస్సుల ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. సోమవారం నుంచి ప్రయాణికులకు గిఫ్ట్‌స్కీం అమల్లోకి వస్తుందన్నారు. ఆ రూట్‌లో ప్రయాణం చేసిన ప్రయాణికులు టికెట్ వెనుక పేరు, అడ్రస్, ఫోన్ నంబర్ రాసి ఆయా బస్సుల్లో ఉంచిన గిఫ్ట్ బాక్స్‌ల్లో వేయాలన్నారు. ప్రతి నెలా 15వ తేదీన డ్రా తీసి ముగ్గురికి బహుమతులు అందజేస్తామన్నారు. ప్రయాణికులు గిఫ్ట్‌స్కీంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీశైలదేవస్థానంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్, కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 13 మంది అంతర్గత బదిలీలను చేస్తూ ఈఓ ఎస్ లవన్న ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ప్రధానంగా స్వామివారి ఆలయ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.దివాకర్‌రెడ్డిని జి-2, ఎల్-1 సీట్ కు బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ లోకేశ్వరప్పను స్వామివారి టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ డి.బాలకార్తిక్ గౌడ్ ను డీసీబి విధులకు కేటాయించారు. అలాగే పలువురు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, వాచ్ మెన్ ,అటెండర్, ఒప్పంద సిబ్బంది, డైలీ వేజర్స్ సిబ్బంది మొత్తం 13 మంది సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే విధుల్లో చేరాలని ఈఓ పేర్కొన్నారు.

లింగాలగట్టు వద్ద ట్రాఫిక్‌జాం

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాల గట్టు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. లింగాలగట్టు గ్రామంలో మత్స్యకారులు హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారికి పక్కనే చేపలు విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌జాం అవుతోంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు, పంచాయితీ అధికారులు, మత్స్యశాఖ అధికారులు ఎన్ని మార్లు మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ రోడ్లకు ఇరువైపున చేపల విక్రయం కొనసాగిస్తుండడంతో వాహనదారులకు కష్టాలు తప్పడంలేదు. శ్రీశైలానికి శని,ఆది, సోమవారాల్లో భక్తులు తమ వాహనాల్లో భారీగా వస్తుంటారు. చేపల విక్రయంతో లింగాలగట్టులో ట్రాఫిక్ జాం సమస్య పరిపాటిగా మారింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఎస్‌కేపీ హైస్కూల్ (1990-91బ్యాచ్) పూర్వ విద్యార్థులు

డోన్ : స్థానిక కన్యకా పరమేశ్వరి ఎయిడెడ్ ప్రభుత్వ పాఠశాల (1990–91బ్యాచ్) పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానికంగా, ఇతర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు దాదాపు ముప్పైమూడేళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన అప్పటి గురువులు మౌలాలి, పూల ఆంజనేయులు, బ్రహ్మం, సుబ్బరాయుడు, ప్రతాప్‌నాయుడు, వెంకటస్వామి, శ్రీధర్, ప్రసాద్, సుబ్రమణ్యం, మురళి, విసి ప్రసాద్‌ను సన్మానించారు. గురువులకు శా లువాలు కప్పి పూలమాలలతో సత్కరించి పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు పూర్వవిద్యార్థులు.

చిన్ననాటి స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం

1990–91 పదవ తరగతి బ్యాచ్‌కు సంబంధించిన కొందరు మృతి చెందగా వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 25వేల చొప్పున అందజేశారు. అదేవిధంగా దత్తాత్రేయ దేవస్థానం గోశాలకు రూ.5వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం పట్టణంలోని పాతబస్టాండ్, అమ్మ హోటల్, పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, ఆర్ట్ రమణ, మహేశ్వరరెడ్డి, సహచర మిత్రులు శ్రీసుధ వేణు, అజిత్, నాగరాజు, సత్యం, ప్రసాద్, బసవరాజు, టైలర్ బాషా, లక్ష్మణస్వామి, రజని, శివ, శ్రీనివాసులు, రజనీ వేణు, రాజబాబు, సాయి, రామక్రిష్ణ,రంగారెడ్డి, వీర తదితరులు పాల్గొన్నారు.

మరోసారి పొంగిపొర్లిన పాలేరు వాగు

మహానంది: మహానంది–గాజులపల్లె మార్గంలోని పాలేరువాగు ఆదివారం మరోసారి పొంగి ప్రవహించింది. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నల్లమలలోని నీరు పాలేరువాగులో చేరుతోంది. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల సమీపంలో ఉన్న పాలేరు ఉధృతి అధికం కావడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు తెలియక ఈ మార్గంలో వెళ్లి ఇరుక్కుపోగా, కె వీవీఆర్ యూత్ సభ్యులు పాలేరు వాగు వద్దకు చేరుకుని సేవలు అందించారు. ప్రయాణికులను, వారి వాహనాలను సురక్షితంగా దాటించి అందరిచేత మన్ననలు పొందారు.

రోడ్డుపైకి ఎక్కి ప్రవహిస్తున్న పాలేరు వాగు →



కుందూకు నీరు.. చిగురించిన ఆశలు


పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఉయ్యాలవాడ : ఈ నెల ప్రారంభం నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండలంలోని కుందూనదిలో పది అడుగులకు తగ్గకుండా నీరు ప్రవహిస్తూ ఉంది. ఎగువ నుంచి నదికి నీరు విడుదల కొనసాగుతోంది. నదీ తీరం వెంట వున్న గ్రామాల రైతులకు సాగు నీరు కష్టాలు తొలగాయి. అలాగే మండలంలో ప్రజలు ఇక తాగు నీటికి ఇబ్బందులు పడవలసిన అవసరం లేదు. సమృద్ధిగా సాగు నీరు పంటకు అందుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. నదీ తీరం వెంట ఉన్న గ్రామాల కొంత మంది రైతులు వరి, మిరప పంటలు విస్తారంగా సాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఉయ్యాలవాడ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తస్యనారాయణ తెలిపాలు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని హరివరం గ్రామానికి చెందిన కొలిమి హసీనాకు బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామానికి చెందిన మహబూబ్‌బాషాతో 2019లో వివాహం చేశారు. అప్పట్లో కట్నకానుల కింద ఐదు తులాల బంగారు, రూ.50వేల నగదు ముట్టజెప్పారు. అయితే నాలుగేళ్ల నుంచి సంతానం కలుగలేదనే నెపంతో అదనపు కట్నం తీసుకు రావాలని, లేకుంటే రెండో వివాహం చేసుకుంటానని భర్తతో పాటు అత్త హుసేన్‌బీ, ముగ్గురు ఆడపచులు మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారని హసీనా పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వైద్యం.. మరింత చేరువ!

- జిల్లాకు ఏడు బ్లాక్ హెల్త్ యూనిట్‌లు
- ఒక్కో యూనిట్‌కు రూ.50 లక్షలు


కొలిమిగుండ్లలో భవనాల నిర్మాణానికి పునాదులు తవ్విన దృశ్యం

కొలిమిగుండ్ల: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత కల్పిస్తుంది. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మార్చేయడంతోపాటు వైద్యుల నియామకం చేపట్టిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఆధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచేలా చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకునే వారి సంఖ్య పెరిగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడ్పాటుగా కేంద్రం సైతం వైద్య రంగానికి బాసటగా నిలుస్తుంది. జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద తాజాగా జిల్లాకు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌లను మంజూరు చేసింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఇటీవలనే భవన నిర్మాణ పనులు మొదలయ్యాయి. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ల దాదాపు 54 రకాలకు పైగానే పరీక్షలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇవి వాడుకలోకి వస్తే గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు దరిచేరనున్నాయి. ఈ మేరకు కొలిమిగుండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే నిర్మించేందుకు పునాదులు తీశారు.

జిల్లాకు ఏడు బ్లాక్ యూనిట్‌లు

జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్రం జిల్లాకు ఏడు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లను మంజూరు అయ్యాయి. ఒక్కో యూనిట్‌కు రూ.50 లక్షల చొప్పున రూ.3.50 కోట్ల నిధులను విడుదల చేశారు. కొలిమిగుండ్లతో పాటు ఇతర మండలాల్లో నిర్మాణ పనులు మొదలయ్యాయి. జనాభా, పీహెచ్‌సీల్లో డెలివరీల సంఖ్య, ల్యాబ్ సౌకర్యం లేని ప్రాంతాలతో పాటు పట్టణాలకు దూరంగా ఉన్న పీహెచ్‌సీల్లో బ్లాక్ హెల్త్ యూనిట్లను నిర్మించనున్నారు. ఈయూనిట్ల ద్వారా వ్యాధులను గుర్తించడం సులభతరం అవుతుంది. బీహెచ్‌పీయులు ఒకే ప్రాంగణంలో ఉండేలా అధికార్యులు చర్యలు తీసుకున్నారు. నూతన భవనాలు నిర్మించి ఫ్యాకల్టీ నియమించి ల్యాబ్ పరికరాలను సిద్ధం చేయనున్నారు. ఇప్పటికే పీహెచ్‌సీలకు అల్ట్రాసోనో సెఫీ మిషన్‌లు పంపించారు. డయాగ్నసిస్, రేడియాలజీ, లివర్,కిడ్నీతో పాటు మొత్తం 54 రకాలకు పైగానే పరీక్షలు చేసేందుకు అవకాశం ఉంటుంది. బ్లాక్ యూనిట్లు హమ్మర్ ల్యాబ్‌లుగా మారబోతున్నాయి.

మెరుగైన వైద్య సేవలు అందుతాయి



బ్లాక్ హెల్త్ యూనిట్ల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. సాధారణంగా పల్లెల్లో ప్రతి చిన్న స్కానింగ్ చేయించుకోవాలన్నా రోగులు పట్టణాలకు వెళ్లాల్సి ఉండేది. ఇవి వాడుకలోకి వస్తే 54 రకాల టెస్ట్‌లు ఇక్కడే చేస్తారు. జిల్లాకు ఏడు యూనిట్లు మంజూరు కావడం శుభపరిణామం.

– వెంకటరమణ, డీఓఎంఅండ్ హెచ్ఓ